క్లుప్తంగా

ఆలయాభివృద్ధికి విరాళం



ఈఓకు నగదు అందజేస్తున్న దాతలు

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి నంద్యాల మండలం అయ్యలూరు మెట్టకు చెందిన హేమసాయి ఈశ్వరరెడ్డి కుటుంబ సభ్యులు రూ. 50వేలు విరాళం అందజేశారు. ఈ మేరకు దాతలు నగదును ఈఓ రామకృష్ణకు ఇచ్చారు. స్వామివారికి ప్రత్యేక పూజల అనంతరం దాతలకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

సన్మానం



గద్దల సామేల్‌ను సన్మానిస్తున్న తెలుగు బాపిస్టు సంఘం సభ్యులు

పాణ్యం: ఎస్సీ వర్గీకరణే లక్ష్యంగా ఏళ్లతరబడి పోరాటాలు సాగించిన ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు గద్దల సామేల్‌ను ఆదివారం గోనవరం గ్రామం బాపిస్టు చర్చిలో సంఘం ప్రతినిధులు సన్మానించారు. ఆయనకు సభ్యులు పూలమాలలు వేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో తెలుగు బాసిస్టు సంఘం సభ్యులు ప్రసాద్, మోహన్, దత్తు, ఏబు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పాణ్యం: మండల పరిధిలోని గోనవరం వద్ద భూపనపాడు రస్తాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైనట్లు స్థానికులు ఆదివారం తెలిపారు. గోనవరం నుంచి భూపనపాడు రోడ్డు వైపు వెళ్తున్న ఓ కారును మరో వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. స్థానికులు గాయపడినవారిని ఆసుపత్రికి తీసుకెళ్లారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతి చెందిన జాకీర్ ఉసేన్

పాణ్యం: మండల పరిధిలోని కొండజటూరు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో జాకీర్‌ఉసేన్ (52) అనే వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ నరేంద్రకుమార్‌రెడ్డి ఆదివారం తెలిపారు. పాలూరు గ్రామం నుంచి జాకీర్‌ఉసేన్ కొండజుటూరుకు ద్విచక్రవాహనంలో వస్తుండగా నంద్యాలకు వెళ్తున్న ఆటో ఎదురుగా రావడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ద్విచక్ర వాహనం నుంచి పక్కనే ఉన్న పొలాలోకి జాకీర్‌ఉసేన్ ఎగిరిపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఆయనను అదే ఆటోలో నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కొలుకోలేక మృతి చెందినట్లు ఎస్ తెలిపారు. ఆటో ఎదురుగా వస్తుందని భయపడి అదుపుతప్పి కిందపడ్డారని ఆటో డ్రైవర్, ఆటో తగలడంతోనే ప్రమాదం జరిగిందని మృతుడి బంధువులు తెలిపారు. బాధితులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్ఐ చెప్పారు. మృతుడికి భార్య సైజున్, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మరో 20రోజుల్లో పెద్ద కుమార్తె వివాహం ఉండడంతో అన్ని ఏర్పాటు చేసుకుంటున్నామని బంధువుల వాపోయారు.

కోలుకోలేక కార్మికుడు మృతి

పాణ్యం: మండల కేంద్రం పాణ్యం గ్రామానికి చెందిన శ్రీనివాసులు (56) కొలుకోలేక మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఆదివారం తెలిపారు. వివరాల మేరకు శ్రీనివాసులు పాణ్యం సబ్‌స్టేషన్‌లో పీటూపీ (పోల్‌టూపోల్)కార్మికుడిగా పని చేస్తున్నారు. ఈ ఏడాది జులై 21న పిన్నాపురం గ్రామంలో విద్యుత్ సమస్యరాగా సరి చేసేందుకు స్తంభం ఎక్కారు. షార్ట్ సర్క్యూట్‌తో స్తంభంపై నుంచి కందిపడడంతో తలకు, కాలికి తీవ్ర గాయాలైయ్యాయి. నంద్యాల ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్న శ్రీనివాసులు కొలేకోలేక మృతి చెందాడు.

ఇస్కాన్‌లో వామన ద్వాదశి వేడుకలు



ప్రత్యేక అలంకారంలో జగన్నాథ్, బలదేవ్, సుభద్ర

కర్నూలు కల్చరల్: ఇస్కాన్ ఆధ్వర్యంలో భగీరథ కాంప్లెక్స్‌లోని పూర్తి జగన్నాథ మందిరంలో ఆదివారం వామన ద్వాదశి వేడుకలు, భగవద్గీత తరగతులు నిర్వహించారు. జగన్నాథ్, బలదేవ్, సుభద్రలను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. హరే రామ హరే కృష్ణ సంకీర్తన చేశారు. తిరుపతి ఇస్కాన్ ఉపాధ్యక్షులు రూపేశ్వర్ ప్రభు సందేశమిచ్చారు. కర్నూలు ఇస్కాన్ బాధ్యులు రఘునందన సేవక్ ప్రభు, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ తీరు మారాలి



మెడికల్ కళాశాలు, వైద్య సీట్ల ప్రైవేటీకరణపై తక్షణమే ప్రభుత్వం తన వైఖరి మార్చుకోవాలి. సామాన్యులు కూడా వైద్యరంగంలో రాణించాలనే ఉద్దేశంతో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి జిల్లాకు ఓ మెడికల్ కళాశాలను మంజూరు చేసి నిర్మాణం కూడా చేపట్టారు. ఐదు కళాశాలో ఆడ్మిషన్లు ప్రారంభించారు. అయితే రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ తీరు విడ్డూరంగా ఉంది. టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రభుత్వం ఇకనైనా పేదలకు అందే మెడికల్ విద్యను దూరం చేయకుండా చర్యలు తీసుకోవాలి. సామాన్యులకు అందుబాటులో ఉండే మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ ఆపాలి. – సద్దల శ్రీనివాసరెడ్డి, గగ్గటూరు

పేదలకు వైద్య విద్య అందని ద్రాక్ష



టీడీపీ కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన పీపీఓ విధానంతో పేద విద్యార్థులకు వైద్యవిద్య అందని ద్రాక్ష అవుతుంది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద విద్యార్థులు కూడా డాక్టర్లు కావాలనే లక్ష్యంతో ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ ఏర్పాటు చేశారు. దీంతో పేద విద్యార్థులు ఎంతో సంబరపడ్డారు. అయితే 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మెడికల్ సీట్లను ప్రైవేట్ పరం చేస్తుండడం విచారకరం. ఇకనైనా టీడీపీ కూటమి ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలి. పేద విద్యార్థులు మెడికల్ చదివేందుకు అవకాశం కల్పించాలి. – భాష్యం ఎల్లగౌడ్, పాణ్యం

పచ్చిమిర్చి రైతుకు ధర పోటు!

- దిగుబడులున్నా.. ధరల్లేక అన్నదాత విలవల
- క్వింటాం మిరప రూ.900 పడిపోయిన వైనం
- జిల్లాలో 2,827ఎకరాల్లో మిరప సాగు



ధరలేక మిరపకాయలను తెంపకుండా వదిలేసిన తోట



మార్కెట్‌కు తరలించేందుకు తెంపిన పచ్చిమిర్చి

కోడుమూరు రూరల్: అన్నదాత సమస్యలతో సతమతం అవుతూనే ఉన్నాడు. ప్రతికూల పరిస్థితుల మూలంగా కొట్టుమిట్టాడుతున్నాడు. వర్షాభావ పరిస్థితులను అధిగమిస్తే.. గిట్టుబాటు ధర అందక ఇబ్బందులు పడుతూనే ఉన్నాడు రైతన్న. కోడుమూరు మండలం ప్యాలకుర్తి గ్రామానికి చెందిన రైతు రఫీక్ రెండెకరాల్లో రూ.లక్షకు పైగా ఖర్చు పెట్టి మిరప సాగు చేశాడు. రైతు కష్టం ఫలించి మిరప బాగా పెరిగడమే కాదు దిగుబడులు భారీగా వచ్చాయి. అయితే గిట్టుబాటు ధర లభించలేదు. నిన్నమొన్నటి వరకు బహిరంగ మార్కెట్లో కిలో రూ.60లకు పైగా పలికన మిర్చి నేడు ఏకంగా కిలో రూ.15 వరకు పడిపోయింది. దీంతో మిరప తెంపిన కూలీలు కూడా గిట్టుబాటవ్వని పరిస్థితి. దీంతో రైతు పంటను పూర్తిగా తొలగించాడు. ఇది ఒక్క మిరప సాగు చేసిన రైతు రఫీక్ ఒక్కడి పరిస్థితే కాదు... కర్నూలు జిల్లాలో మిరప పంట సాగు చేసిన చాలామంది పరిస్థితి ఇది.

జిల్లాలో 2,827ఎకరాల్లో మిరప సాగు

కోడుమూరు, సి.బెళగల్, నందవరం, మంత్రాలయం, పెద్దకడుబూరు, పత్తికొండ, క్రిష్ణగిరి మండలాల్లో రైతులు మిరపను బోరుబావుల కింద 2,827ఎకరాలకు పైగా సాగు చేశారు. మిరప నార, నాట్లతో పాటు, పంట చేతికొచ్చే సరికి కలుపులు, మందులు, సేద్యం మొత్తం కలుపుకుని ఎకరాకు రూ.55వేల నుంచి రూ.65వేల వరకు ఖర్చు చేశారు రైతులు. అయితే ధర లేకపోవడంతో మిరప రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

తగ్గిన పచ్చిమిర్చి ధర

నెలరోజుల క్రితం వరకు బహిరంగ మార్కెట్లో కిలో రూ.60 పైగా పచ్చిమిర్చి ధర పలికింది. ప్రస్తుతం మార్కెట్లో రూ.12ల నుంచి రూ.15లు మాత్రమే ఉంది. అది కూడా నాణ్యత మేరకు క్వింటాల్ రూ.800 నుంచి రూ.900 వరకు రైతుల నుంచి వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. మిరపకాయలను తెంపేందుకు ఒక్కో కూలీకి రోజుకు రూ.300 నుంచి రూ.350 వరకు ఖర్చు అవుతుంది. మిరపకాయలను తెంచి మార్కెట్‌కు తరలించాలంటే ఒక్కో బస్తాకు కర్నూలు మార్కెట్‌కు అయితే ఆటో బాడుగలు కలుపుకుని రూ.60, హైదరాబాద్‌కు అయితే రూ.120 వరకు ఖర్చవుతుంది. ఈ లెక్కన రైతుకు మిరపకాయలను తెంచిన కూలి కూడా గిట్టుబాటవ్వని పరిస్థితి నెలకొంది. మిరప దిగుబడులు బాగున్నా ధర లేక రైతులు విలవిల్లాడుతున్నారు.

మిరప పంటను తొలగించేందుకు సిద్ధమవుతున్న రైతులు

మిరప దిగుబడులు బాగున్నా ధర లేకపోవడంతో మిరప సాగు చేసిన రైతులు పంటను తొలగించేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే చాలామంది రైతులు చెట్లనుంచి మిరపకాయలను తెంపకుండా అలాగే వదిలేస్తున్నారు. ధర ఇలాగే ఉంటే మరో 10నుంచి 15రోజుల్లో మిరప పంటను తొలగించి ఇతర పంటలను సాగు చేద్దామనే ఆలోచనలో పడ్డారు రైతులు.

తీవ్రంగా నష్టపోయా



మూడున్నర లక్షలకుపైగా పెట్టుబడి ఏడెకరాల్లో మిరప సాగు చేశా. ఇంతవరకు మార్కెట్లో మిరప ధర బాగున్నప్పటికీ తమకు దిగుబడులు వచ్చేసరికి పూర్తిగా పడిపోయింది. రూ.300లు కూలి ఇచ్చి మిరపకాయలను తెప్పిస్తే కూలీల ఖర్చులు కూడా రావడం లేదు. మిరపను అలానే వదిలేశా. – రైతు అన్సార్, ప్యాలకుర్తి

పంటను తొలగిద్దాం అనుకుంటున్నా



రూ.2లక్షలకు పైగా పెట్టుబడి పెట్టి మిరప పంటను సాగు చేశా. పంట చేతికొచ్చినప్పటి నుంచి ధర లేకుండా పోయింది. మిరపకాయలను తెంపి మార్కెట్‌కు పంపిస్తే కూలీల ఖర్చులకు కూడా రాలేదు. పరిస్థితి ఇలాగే ఉంటే కనీసం పెట్టుబడి కూడా దక్కని పరిస్థితి. ధర లేకపోతే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. కొన్ని రోజులు చూసి మిరప పంటను తొలగిద్దాం అనుకుంటున్నా. –మోదిన్ సాహెబ్, ప్యాలకుర్తి

విద్యుత్ అంతరాయంతో అల్లాడిన నగరవాసులు

కర్నూలు న్యూసిటీ: ఆదిదేవుడు వినాయక నిమజ్జన వేడులక వేళ విద్యుత్ అధికారులు నగరవాసులకు నరకం చూపారు. వినాయక నిమజ్జనం చూసేందుకు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన బంధువలతో కిటకిటలాడిన నగరవాసుల కుటుంబాలు విద్యుత్ అంతరాయంతో ఉక్కిరిబిక్కిరయ్యారు. ఉదయం నుంచి రాత్రి వరకు విద్యుత్ సరఫరా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వినాయక నిమజ్జన విధుల్లో నిమగ్నమైన విద్యుత్ సిబ్బంది అధికారులు వినాయక ఘాటుకు కూత వేటు దూరంలో ఉన్న ప్రాంతాల్లో గంటల తరబడి సరఫరా లేకపోయినా పట్టించుకున్నపాపాన పోలేదు. దేవనగర్, మద్దూరునగర్, శ్రీరామనగర్, శ్రీలక్ష్మీనగర్, ఆదిత్యనగర్, క్రిష్ణానగర్, అబ్బాస్‌నగర్, తదితర కాలనీలో అప్రకటిత విద్యుత్ అంతరాయంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని పలువురు వాపోయారు.

నేడు రచయిత్రి ఆరేపల్లి పుస్తకాల ఆవిష్కరణ

కర్నూలు కల్చరల్: కవయిత్రి ఆరేపల్లి వరలక్ష్మమ్మ రచించిన శ్రీమద్దేవీ భాగవతం-1, 2, రాజశేఖర చరిత్ర, దశకుమార చరిత్రము, పారిజాతాపహరణం పుస్తకాలను సోమవారం ఉదయం 10 గంటలకు పింగళి సూరన తెలుగు తోటలో ఆవిష్కరించనున్నట్లు నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం(నరసం) అధ్యక్షురాలు డాక్టర్ దండెబోయిన పార్వతీ దేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు

నంద్యాల (వ్యవసాయం): కేరళ రాష్ట్రంలో జరిగే ఓనం పండగను పురస్కరించుకొని ఆదివారం గుడిపాటి గడ్డలోని అయ్యప్పస్వామి ఆలయంలో వేదంపండితులు విశేష పూజలు నిర్వహించారు. స్వామివారి మూలవిరాట్‌కు సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు, గంధాభిషేకం అనంతరం పట్టువస్త్రాలతో అలంకరించి కేరళ సంప్రదాయ పద్ధతిలో ప్రసాదలను నైవేద్యంగా సమర్పించారు. వినాయక, నవగ్రహ, అయ్యప్పస్వామి హోమాలు నిర్వహించి పుణ్యాహవచనం జరిపించారు. అయ్యప్ప సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం వడ్డించాలి



కోడుమూరు బీసీ బాలికల హాస్టల్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

కోడుమూరు రూరల్: ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని డిమాండ్ చేస్తూ కోడుమూరు బీసీ బాలికల వసతి గృహం ఎదుట ఆదివారం ఏఐఎస్ఎఫ్ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రంగస్వామి మాట్లాడుతూ వసతి గృహాల్లో మెనూ పాటించకపోవడం అన్యాయమన్నారు. ఆదివారం మధ్యాహ్నం చికెన్‌తో కలిపి భోజనం అందజేయాల్సి ఉందని, అయితే క్యాబెజీ కూర వడ్డించడం సమంజసం కాదన్నారు. ఎవ్వరైనా విద్యార్థినులు సమస్యలను చెబితే వారిపై వార్డెన్ వేధింపులకు పాల్పడుతుఉన్నారని ఆరోపించారు. ఇకనైనా జిల్లా అధికారులు స్పందించి మెనూ ప్రకారం హాస్టళ్లలో భోజనం పెట్టేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు వీరాంజనేయులు, సిద్ధు, వినయ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

గోస్పాడు: మండలంలోని తేళ్లపురి గ్రామ కుందూ సమీపంలోని పొలాల్లో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ వెంకటప్రసాద్ తెలిపిన వివరాల మేరకు పొలాల్లో గుర్తు తెలియని వ్యక్తికి చెందిన మృతదేహం ఉన్నట్లు గ్రామస్తులు గుర్తించి సమాచారమివ్వడంతో వెళ్లి పరిశీలించగా శవం గుర్తు పట్టలేనంతగా మారిందన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు. ఎవరైనా గుర్తిస్తే ఎస్ఐ సెల్ 9121101172 నంబర్‌కు సమాచారం చేరవేయాలని కోరారు.



అడుగుకో గుంత... అడుగుపడేదెలా...!

గడివేముల కొర్రపోలూరు దారి దుస్థితి ఇది

గడివేముల: రోడ్లు అధ్వానంగా మారాయి. ఎడతెరపివ్వని వర్షాలకు రహదారులు ధ్వంసం అయ్యాయి. మండల కేంద్రమైన గడివేముల నుంచి కొర్రపోలూరు, మంచాలకట్ట గ్రామాల రోడ్లలో అడుగకో గుంత దర్శనమిస్తుంది. ఈ రెండుగ్రామాలకు వెళ్లాలంటే నరకయాతన. నడుం నొప్పులుంటే పెరుగుతాయి.. లేకుంటే మాత్రం తప్పకుండా వస్తాయంటున్నారు ఆయా పల్లెల ప్రజలు. ఒకటి కాదు...రెండు కాదు ఊర్లోకి వెళ్లే వరకు గుంతలు ఉండటంతో అనేకపర్యాయాలు రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకున్న సంఘటనలు కోకొల్లలు. ప్రజలు మండల కేంద్రంలోని తహసీల్దార్, ఎంపీడీఓ, ఆసుపత్రి, ఇతర కార్యాలయాలతో పాటు వివిధ పనుల నిమిత్తం రావాలంటే అవస్థలు పడాల్సి వస్తుంది. రెండు గ్రామాలకు బస్సు సౌకర్యాలు సరిగా లేకపోవడంతో అధికంగా బైకులపైనే రావాల్సి వస్తుంది. గర్భిణుల పరిస్థితి మరింత దారుణంగా మారిందని ఆ గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర వేళల్లో ఆస్పత్రులకు వెళ్లేలోపే ప్రాణాలు పోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి రెండు గ్రామాల రహదారులకు కనీసం మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు కొర్రపోలూరు, మంచాలకట్ట గ్రామాల ప్రజలు.



కుంటను తలపిస్తున్న గడివేముల టూ మంచాలకట్ట రహదారి

భక్తిశ్రద్ధలతో గణనాథుల నిమజ్జనం



కల్లూరు చెన్నమ్మ సర్కిల్‌లో నిమజ్జనానికి తరలివెళ్తున్న వినాయకుడు



సల్కాపురం వేలం పాటలో లడ్డును దక్కించుకున్న తులసిరెడ్డి

కల్లూరు : వినాయక చవితి పర్వదినం కొలువుదీరిన బొజ్జ గణపయ్యలు తొమ్మిది రోజులుగా పూజలందుకుని ఆదివారం నిమజ్జనానికి తరలివెళ్లారు. భక్తుల కోలాహలం మధ్య గణపయ్యల ఊరేగింపు కనుల పండువగా సాగింది. చిన్న,పెద్ద తేడా లేకుండా కేరింతలు కొట్లారు. చిన్నారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. కల్లూరు అర్బన్‌లోని 16 వార్డులలో కొలువుదీరిన వినాయకుడికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సల్కాపురం గ్రామంలో వినాయకుని లడ్డూను వేలం పాటలో రూ.40 వేలకు అదే గ్రామానికి చెందిన పుచ్చకాయల తులసిరెడ్డి దక్కించుకున్నారు. భక్తిశ్రద్ధలతో వినాయకుల దగ్గర కోలాటాలు, నృత్యాలు చేస్తూ సంతోషంగా నిమజ్జనానికి తరలించారు. కర్నూలు కేసీ కెనాల్‌లో బొజ్జ గణపయ్యలను నిమజ్జనం చేశారు.

మాసా మసీద్ వినాయక ఘాట్‌ను అభివృద్ధి చేస్తాం

కర్నూలు (రూరల్) : కర్నూలు శివారులోని మాసా మసీద్ సమీపంలో ఉన్న వినాయక ఘాట్‌ను మరింతగా అభివృద్ధి చేస్తామని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరితో కలసి ఆదివారం మాసా మసీద్ దగ్గర ఉన్న ఘాట్‌లో నిమజ్జన వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక ఘాట్ తరహాలోనే మాసా మసీద్ వద్ద కూడా శాశ్వత ఘాట్‌ను నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కల్లూరు కాలనీలు, విష్ణు టౌన్‌షిప్, స్టాంటన్‌పురం, బాలాజీ నగర్, వెంకటరమణ కాలనీలోని కొన్ని ప్రాంతాలలో కొలువుంచిన వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు.



వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న దృశ్యం



కృష్ణానగర్‌లో వినాయకుని ముందు కోలాటం ఆడుతున్న భక్తులు

బాక్సింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం పట్టణంలోని ఓటీపీ అకాడమీ హాల్‌లో జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. ఆంధ్రప్రదేశ్ బాక్సింగ్ అసోసియేషన్ ప్రతినిధి, ద్రోణాచార్య అవార్డు గ్రహీత వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఎన్నిక జరిగింది. నంద్యాల జిల్లా చైర్మన్‌గా బీసీ ఇంద్రారెడ్డి, జిల్లా అధ్యక్షుడిగా మహబూబ్‌బాషా, జనరల్ సెక్రటరీ గయాజుద్దీన్‌ను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. న్యాయ సలహాదారుడు అలీహుసేన్, జిల్లా పీఈటీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బత్తుల రవికుమార్ మాట్లాడుతూ బాక్సింగ్ అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

జిల్లా షూటింగ్ బాల్ ఎంపిక పోటీలు

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 19వ తేదీన నంద్యాల జిల్లా జూనియర్ షూటింగ్ బాల్ ఎంపిక పోటీలు స్థానిక ఎస్పీజీ క్రీడా మైదానంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్, కార్యదర్శి పరమేశ్వరరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతిభ చూపిన వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేసి రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతామన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ప్రవేశరుసుముతో వయస్సు ధ్రువ పత్రంతో హాజరు కావాలన్నారు. 2005 ఏప్రిల్ 1 తర్వాత జన్మించిన వారు పోటీల్లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగును అరికట్టండి



విద్యార్థులతో కలిసి రోడ్డుపై ప్రహిస్తున్న మురుగునీటిని పరిశీలిస్తున్న నాయకులు

ఓర్వకల్లు: మండలంలోని ప్రధాన రహదారి నుంచి గ్రామంలోకి వెళ్లే రోడ్డుపై మురుగునీరు ప్రహిస్తుహించడంతో హాస్టల్ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యను తక్షణమే పరిష్కరించాలని వ్యకాస జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న డిమాండ్ చేశారు. ఆదివారం గ్రామంలోని బాలుర వసతి గృహాన్ని ఆయన పరిశీలించారు. హాస్టల్ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో కొన్ని గదుల్లో పైకప్పు నుంచి పెచ్చులూడి పడుతున్నాయని, దీంతో పాటు గదుల్లో ఫ్యాన్లు పనిచేయడంలేదని విద్యార్థులు ఏకరుపు పెట్టారని తెలిపారు. అనంతరం హాస్టల్ ప్రక్కన వున్న ప్రధాన రహదారిపై మురుగునీరు ప్రహించడంతో పాఠశాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బంధిగా మారిందని విద్యార్థులు వాపోతున్నట్లు పేర్కొన్నారు. అధికారులు స్పందించి వెంటనే సమస్యలు పరిష్కరించాలని, లేని పక్షంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.